# ౧౦ వైరాగ్యప్రసక్తి

"ఈరోజుల్లో అసలు భిక్షకుపిల్చేవారేలేరు" అంటూ సాముల వారు తనయొక్క ఖాళీచేసిన టిఫిన్‌కారియర్ రైలుబండిలో బల్లకిందకు తోసి, బల్లమీదపండుకున్నాడు. ఆయెదురుబల్లమీదనే "అసలువంటకు పిల్చేవాళ్ళున్నారా ? అండీ ! ఈరోజుల్లో" అంటూ వితంతువు తనయొక్క బూరుగుదూదితలగడా, పూలగుడ్డతొడుగుది, పైకితీసి తలకిందెట్టుకు పడుక్కుంది. ఆబండిలో వారిద్దరిమధ్యనూ సంభాషణజరగటానికి ఓంప్రథమం అదే అనుకోండి పాఠకులు !

రైలు మంచిస్పీడ్‌లో పోతూవుంది. "ఝుంచకర" "ఝుంచకర" అనే చక్రాలచప్పుడుతోపాటు ఎన్నో యితరచప్పుళ్ళు, పట్టాలరాపిడి రంయి, యింజన్‌యీల బంయి, గాలి గంయి, అన్నీకలిసి మేళంగావిస్తూ బండీనడిపిస్తూ వున్నాయా అన్నట్టుంది. పూరీ ప్యాసెంజర్ అది. రేత్రివేళ తుని ఆ ప్రాంతాన్ని చీకటిపడింది. బండిలో లైట్లు వెలుగుతున్నాయి.

స్వాములవారూ, వితంతువూ, ఇద్దరూ ఒకపెట్టిలో పైనిచెప్పిన పంఘిణీగా మిగిలిపోయి, ఒకరినొకరు పలకరించుకోకుండా, పులకరించు కోకుండా వున్నారూ అంటే అంతక్రితం ఆపెట్లెలో చాలామంది ఎక్కి, చాలామంది దిగి, ఎక్కడో ఆయిద్దరిమట్టుకు వుండిపోయి యింకా తమ

తమ గమ్యస్థానాలకోసం నిరీక్షిస్తూవున్నారు అని మనం అనుకోవలసి వుంటుంది. రైలుపెట్టికావించే జనం వడపోత వొక్కొక్కప్పుడు బహూ చిత్రమైనదిగా అనిపిస్తుంది. ఆవిచిత్రపువడపోతల్లో ఈ వడపోత వొకటి.

"అయితే నీవు వంటలక్కవు అన్నమాట" అన్నాడు స్వాములవారు. "అవునండీ! ఇలా పనిలేక, ఏమహారాజైనా పోషిస్తాడేమో అని ఎదురుచూస్తూ రైళ్ళట్టుకు తిరుగుతున్నాను" అంది వితంతువు. స్వాములవారు "బూరుగుదూది తలగడా తలకిందెట్టుకుతిరిగే వంటలక్కను చూడ్డం యిదే మొదటితఫా నాజీవితంలో" అన్నాడు. "నాకూ ఇదే మొదటి తఫాసుమండీ టిఫిన్ కారియర్ కూడా పట్టుకుతిరిగే స్వాములవార్ని చూడ్డం" అంది లేచి కూర్చుని వితంతువు. స్వాములవారు "క్షమించు! ఏంచెయ్యమంటావు? బిక్షకు పిల్చేవారు కరువై యిలా అవస్థపడుతూ వున్నాను. లేచి కూర్చున్నావెందుకు? పడుకో! పడుక్కుని మాటాడినా వినబడుతుంది నాకు" అన్నాడు. వితంతువు "మిమల్నిగురించి కాదు లెండీ నేను లేచింది. రైలువేగం తగ్గుతూవున్నట్టుంది. స్టేషన్ ఏదో చేరికకు వచ్చినట్టుంది. ఏం స్టేషనో అని లేచాను" అంది. స్వాములవారు "ఏమీ! ఆస్టేషనులో దిగుతావా?"— వితంతువు "లేదండీ! నేనిప్పుడిప్పుడే దిగేదాన్నికాను. ఈ రైలెంతదూరం పోతుందో అంత దూరం పోయేదాన్నేను" అంది.

స్వాములవారు ఏదోమళ్ళీ జవాబుగా వితంతువుతో మాట్లాడాలని అనుకున్నాడు, కాని అంతలో రైలుబండి వడి మందగిల్లి, లూప్‌లైన్ మెయిన్‌లైన్ సందులు గీసికొంటూ, టకీమని ప్లాట్‌ఫారం పక్కనాగింది.

స్టేషన్ ఏదైతేం! అన్ని స్టేషన్లుచేసే ఫంక్షనూ ఒక్కటే!

రైళ్ళకు లైన్‌క్లియర్లు ఇవ్వడమే. కాని ఆలైన్‌క్లియర్ ఇచ్చేలో
స్వాములవారు వితంతువూ ఇద్దఱూ కూర్చున్న పెట్టెలోకి ఓఅయిదుగురు
ప్రయాణీకులు, కొందఱు ట్రంకుల్తో, కొందరు పరుపులతో, కొందరు
చేతిసంచీలతో— "ఈపెట్టి ఖాళీగావుంది! ఖాళీగావుంది!" అంటూ ఎక్కి-
పోయినారు. గార్డు ఈలేశాడు. ఆకుపచ్చ లాంతరు చూపించాడు.
కూలీ గంటవాయించాడు. ఇంజన్‌కూసి, ఆవిరిపక్కకు దూసి, పొగ
మీదికిమోసి గుప్‌గుప్‌మని బండ్లను గుంజీగుడ్డీ తిరిగి నడకుచ్చుకుంది.

ఆవఱకూ లేచి కూర్చున్న వితంతువు కాళ్ళుసాచుకు యధాప్రకారం
తనబల్లమీద శయనించి కళ్ళుమూసుకుంది. స్వాములవారున్నూ ఓతట్టుకు
తిరిగి కళ్ళుమూశాడు. నూతనంగా ఎక్కిన ప్రయాణీకులు తమతమ
సామానులు కిందామీదా సర్దుకొని, కడంబల్లలమీద కూర్చున్నారు, మధ్య
మధ్యను ఆపెట్టెలోని పాతకాపులు ఎవర్రా అని గమనిస్తూ.

ఎంత కొత్తకొత్తగారైలెక్కినా ఎక్కికూర్చున్నాక కాస్సేపటికో
కాస్సేపటికో అంతావొకరితో వొకరుపరిచయం కలగజేసికోవడం తప్పనిసరి
అన్నట్టు, కొంతసేపటికి పంచపాండవుల సజ్జులో ఒకాయన మరోఆయన్ని
"ఆ రేకు పెట్టె తమదా? అండీ!" అన్నాడు—ఓట్రంకుకేసి తన
చూపుడువేలు చూపిస్తూ. 'చిత్తం' అన్నాడు రెండో ఆయన. "రంగు
బావుంది. చైనాబజార్లో ఎత్తారా?" అని అడిగాడు మరో ఆయన.
నాలుగోఆయన మనవూళ్లోనూ వేస్తున్నారుగాని రంగులు, ఆలావొక్క-
నాటికీ వుండవు! చూడండీ! ఏలాగుందో అందంగా "కిట్‌బ్యాగ్‌లా"
అన్నాడు అయిదో ఆయనతో—అయిదో ఆయన 'ట్రంకులకూ బ్యాగులకూ
భాగ్యం ఏముందిప్పుడు? అవితేఆమధ్యను "ట్రంకుబ్యాగ్‌హత్య" "ట్రంకు
బ్యాగ్‌హత్య" అని వార్తాపత్రికల్లో పడుతూ వచ్చేది. ఏమైందో

ఆకేసు?'' అని టాపిక్ ట్రంకునుండి హత్యలమీదికి మార్చాడు. మొదటి ఆయన ''మీరనేహత్య ట్రంకుకూ సంబంధించిందికాదు, బ్యాగ్‌కూ సంబంధించిందికాదు. ''ఫుల్ బాగ్'' హత్యఅది. అయినా నాట్రంకు ఆలాంటి దనుకున్నారా ఏమిటికొంపదీసి: అది మొన్ననే, లాకాలేజీకి ఎదురుగావున్న షాప్‌లో కొనుక్కుని తీసికున్నాను. ఇదిగోకాష్ రశీదు'' అని డాబుగా తన జేబులోంచి మనీఃర్సు ఓ కాగితం తీశాడు. మూడో ఆయన ''అంతలోనే అంత అనుమానం మీరుపడ్డేల? అందరూ హత్యలు చేయగలిగితే ప్రపంచమేలేదు'' అన్నాడు. అయిదో ఆయన ''బాగా సెలవిచ్చారు'' అన్నాడు. హత్యలు మాట ఎల్లావున్నవ్యభిచారదోషం హెచ్చుగాకనబడుతూ వుందిసుమండీ లోకంలో''అన్నాడు రెండోఆయన. మూడో ఆయన ''తమ అనుభవాన్నిబట్టా అంటూన్నది ?'' అని ముదల కించాడు అదోమోస్తరుగా తనకన్న మొదటి ఆయన కేసి గీటుతూ. ''ఉప్పూ, కారమూ, పులుసూ త్రిమూర్తులై లోకం ఏలుతూవుంటే, ఎలా అణిగి వుంటుంది? ఎలా నిదరపడుతుంది? ఏదోషం చేయకపోతే? అందుకే కలికాలం అన్నారు దీన్ని పెద్దలు !'' అన్నాడు, మూడో ఆయన— మొదటిఆయన ''లేకపోలేదు. ఈ కాలంలోనూ నిద్రపట్టేవాళ్ళు లేక పోలేదు. మనంఎక్కి ఇంత సేపట్నుంచి కబుర్లు చెప్పుకుంటూవున్నా వారిద్దరూ ఎలా నిద్రపోతూన్నారో ! చూడండి !'' అన్నాడు.

అప్పటికప్పుడే రైలు మరోస్టేషన్ చేరుకుంది. 'నాకు సెలవు' అంటూ మొదటిఆయన దిగిపోయినాడు. 'మేంమాత్రం కూరుచుంటామా?' అని తక్కినవారిలో వొకడు తీయబడ్డ తలుపు తిరిగి నొక్కేశాడు. నొక్కిన తరువాతను ఎవరో ప్లాట్‌ఫారముమీదినుంచి తోసినట్టయింది. బండిలో మెళుకువగావున్న నలుగురూ ''ఈ బండిలో చోటులేదయ్యా ! మరిన్నీ ఆడవాళ్లు పండుకుని నిద్దరపోతున్నారు'' అన్నారు.'' నిద్రపోతే

లేపి కూర్చోపెడతాం!" అంటూ ధణాధణా తన్నాడు తలుపును బూట్సు కాలితో. తన్ని గడబిడగా పెట్టిలోకి జొరబడ్డాడు. స్వాములవారు లేచి కూర్చున్నారు. వితంతువు కాళ్ళు ముణుచుకుంది.

ఈ మిక్కిలీ కొత్తమనిషికేసి అంతా తేరిపారచూస్తూ "అలా దయ చెయ్యండి" అన్నారు. మిక్కిలీ కొత్తమనిషి తన తలపాగాతీసి వితంతువుకూ తనకూ అడ్డుగాపెట్టి, బూట్సుకాళ్ళు స్వాములవారి బల్లమీద పొటచాచి, కోటు బొత్తాములు విప్పుకుంటూ, గళ్ళ జేబురుమాల్తో మెడ తుడుచుకు "బండీ అప్పుడే వదిలేసినట్టు ఆ గార్డుగాడు ఈలేస్తే తొందర పడి తలుపుతోసి చొరబడ్డాను. మీలో ఎవరికీ నొప్పి కలగజేయలేదు గదా?" అన్నాడు. "నొప్పి? ఎందుకండీ? ఎవరికండీ? ఇది రైలు పెట్టి. అందరికీ తెలిసిందే" అన్నాడు నలుగురిలో వొకరు. మిక్కిలీ కొత్తమనిషి మందహాసం చేశాడు; మీసాలు దువ్వుకుంటూ "అవితే తమరు ఎక్కణ్ణుంచి వస్తూవున్నారు. అయ్యవార్లంగారూ" అన్నాడు మిక్కిలీ కొత్తమనిషి నలుగురిలో ఒకర్ని కేటాయిస్తూ. అంతవరకు బండిలో వున్నవాళ్ళు పై పలకరించబడ్డ ఆయనకు పంగనామాలున్నాయని గమనించనేలేదు. పంగనామాలాయన వెంటనే "మీది బహూ నిశితదృష్టి సుమండీ! ఇట్టే పోల్చగలిగారు. మీరు పంతుళ్ళా?" అని అడిగాడు. మిక్కిలీ కొత్తాయన "ఆలాగే వాడిక"—ఇంకో ప్రయాణీకుడు "పంతుళ్ళంటే బడిపంతుళ్ళా?" అన్యుడు "బడిపంతుళ్ళయితే చెప్పుకోనేల? వేపారిపంతుళ్ళు". "ఓహో!"

స్వాములవారు ఏతత్సంభాషణ పొడుగుతా తావళం తిప్పుతూ మౌనముద్ర వహించారు. వేపారిపంతులు "చూడండీ! నేనీ ప్రపంచంలో ఎన్నైనా సరే సాధించ గలుగుతున్నాను. గాని వంటమనిషిని సంపాదించ

లేకుండా వున్నాను. మీ వాకబులో ఎవరైనా వుంటే సెలవివ్వండి" అన్నాడు. వితంతువు వెంటనే లేచి కూర్చుని కాళ్ళమీదకు బట్టసరుదు కొని నెత్తిమీదకి ముసుగు లాక్కుని పదునాలుగు మూరల తెల్ల వాయిల్ పంచియొక్క పేస్తర్ రెండుముళ్ళూ వీపునవేసుకు మెడకు చుట్టేసుకుని "ఆడమనిషా తమకు కావలసింది? మగమనిషా?" అని అడిగింది. వేపారి పంతులు ఆమె ముఖంకేసి పరీక్షగా చూస్తూవున్నాడు. పంతులు నోట మ్మట ఏం మాట వస్తుందో అని స్వాములవారు దీక్షతో నిరీక్షిస్తూ వున్నారు. పై నలుగురిలోను వొకడు "వంట కాడవాళ్లే వుండాలిగాని మగవాళ్ళెందు కండీ?" అన్నాడు అయ్యంవార్లంగారితో కాకుండా మరొ క్కరితో అన్నట్లు. ఆ మరొక్కడు "ఆలాకాదు! కొందరు మగముండా వాళ్ళు ఆడవాళ్ళకంటె వంటలో అందెవేసిన చెయ్యిగల వాళ్ళున్నారు. గుళ్ళోఅర్చకులు పులిహారచేస్తే ఏం మజాగా వుంటుందో ఎప్పుడైనా రుచి చూశావు నీవు?" అవతలివాడు "నా నమ్మకం శ్రీవైష్ణవాంగనలే ఆ పులి హారలో పోపుకలుపుతారుగాని మగవాళ్ళు కలపరని". ఆ మాట వేపారి పంతులంది పుచ్చుకుని "ఆడవాళ్ళంటే నీకు మహాఅభిమానం వుందోయి" అన్నాడు తనదృష్టి వితంతువునుంచి త్రిప్పుకుంటూ. "ఇంతకూ మీ అభిప్రాయం వెలిబుచ్చారుకారు?" అన్నాడు అయ్యవార్లంగారు. "చెప్ప డానికేముంది. స్త్రీయే కావాలి." "ఆలాగవితే ఈమె అందుకు సిద్ధంగా వున్నట్టు నేనెంచుతూ వున్నాను. ఈ నా వ్యక్తీకరణంలో పొరబాటే మన్నా వున్నా మన్నించు తల్లీ!" అన్నాడు అయ్యంవార్లంగారు. "మేం స్మార్తులం. ఏ మతస్థులు ఏమన్నా వొప్పుతుంది" అంది వితంతువు.

ఈలా తాపీమాటల్తో రైలుపెట్టి విస్తరించినకొద్దీ జల్దీగా జరుగు తున్నవి రెండే. ఒకటి స్వాములవారి చేతిలోని తావళప్పేరు. రెండు రైలుగాడీ చక్రాలగిర్రు.

వేపారిపంతులు వితంతువుతో వెంటనే యిలా అన్నాడు. "నీవు వాల్తేరులో దిగుతావా ?" వితంతువు "లేదండీ ! ఛత్రపురందాకా పోవాలని అసలెక్కాను బండీ !" అంది. "ఇఖనేం విజయనగరమే మా వూరు. కస్పామాకాపురం. మా యింటిపేరు నా పేరు వ్రాసియిస్తాను చీటీ వెనుక. చీటీలో నిన్నుగురించి వ్రాస్తాను. మా ఆవిడకు చూపించు. ఆమె నిన్ను మిక్కిలీ ప్రేమతో చూడగలదు"—వితంతువు "తిమరు ?". బండీలో వున్న వాళ్ళందరూ తక్కినవాళ్ళు చిరునవ్వు నవ్వారు. ఆమె అడిగిన ప్రశ్నకు. వేపారిపంతులు మాత్రం రైలు గోపాలపట్నం సిగ్నల్ దాటినట్టుండడంచేతనూ, తాను వాల్తేరులో దిగవలసిన వాడవడం చేతనూ, గబగబా తాను వ్రాసి ఆ వితంతువుకు ఇద్దామనే హడావిడికొద్దీ కాయితం వూటకలం, తీస్తూ పై ప్రశ్న వినలే.

స్వాములవారు అప్పటికి కొంత యూపిరిసళల్చి వితంతువుతో "వారు వాల్తేరులో దిగి వెనకనుంచి వచ్చేటట్టున్నారు" అన్నాడు. వేపారి పంతులు తానువ్రాసిన కాగితం మణుస్తూ "మహాత్ములన్నది సత్యం. నా జోన్‌టిక్కట్ ఇంకా 1౫ జనవరి మిడ్‌నైట్‌దాకా వర్కుచేస్తుంది. ఈ దిగటం వాల్తేరులో దిగి అక్కడ వ్యాపారం చక్కబెట్టుకుని తిరిగి వొక్క పర్యాయం బెంగుళూరువెళ్ళి అక్కడ వ్యాపారం సవరించుకుని, మరి విజయనగరం చేరుకుంటూ వున్నాను. అదీ నా ప్రయాణ కార్యక్రమం. ఈమెది అసలు ఏ వూరో ?" స్వాములవారు "ఆభోగట్టా నాకు తెలియదు సుమండీ ! ఏదో మీ హడావిడిని పుచ్చుకు వాల్తేరులో దిగుతారు అని ఊహించాను"—"ఆమెనే అడగండి" అన్నారు తక్కిన నలుగురు. "మీరు విజయనగరంలో దిగుతారా ?" అన్నాడు వారితో వ్యాపారిపంతులు. నలుగురూ ఏకకంఠంగా "మా జోలి మీకెందుకు? మేం గంగలోదిగుతాం"

—వ్యాపారిపంతులు "అంతలో అంతకోపం ఎందుకండీ! మీకు! మీరక్కడ దిగితే ఈమెనుకూడా జాగ్రత్తగా దింపి బండీచేసి పంపిస్తారేమో అని". వితంతువు "బండీడబ్బులు ఇలా ఇవ్వండి. నేచేసుకు ఎక్కగలను" అంది.

రైలు వాల్తేరు చేరుకుంది. నలుగురూ వాల్తేరులో వేరువేరుగా దిగిపోతూ "ఘట్టి ఆడదే ఆమె" అని అనుకుంటూ వెళ్ళిపోయినారు. వ్యాపారిపంతులున్నూ తాను వ్రాసిన చీటీ వితంతువుచేతిలో పెడుతూ "బండి డబ్బులు సంగతికూడా అందులో వ్రాసాను. మా ఆవిడ ఇస్తుంది" అని దిగిపోయినాడు, వెనక్కు వెనక్కు చూస్తూ వితంతువు యొక్క ముఖవర్చస్సున కచ్చెరువడుతూ మీసం దువ్వుకుంటూ వెళ్ళి పోయినాడు.

ఆ రైలుపెట్టెలో మరి మిగిలికూర్చున్నవారు మళ్ళీ ఆ స్వాముల వారూ ఆవితంతువే! రైలు వాల్తేరు విడిచిపెట్టింది. కాబీ వారిబండి లోకి ఎవరూ పరాయి మగవాడుగాని, పరాయి ఆడుదిగాని ఎక్కలేదు. సింహాచలం దాటిన ఆ ప్రాంతాన్ని వితంతువు ఒక్క నిట్టూర్పు విడిచి, వ్యాపారిపంతులు తనకిచ్చిన చీటీచూస్తూ "విజయనగరంలో దిగక తప్ప దనుకుంటాను నేను" అంది. స్వాములవారు "నేనున్నూ విజయనగరం లోనే దిగడం" అన్నాడు. "ఎంత దూరముందో?" "ఎంతో దూరం లేదింక" "మీరు కాశీదాకా ప్రయాణం చేసినట్టున్నారు?" 'హరిద్వార్ దాకా పోయాను" "మఱి మీకు టిక్కట్టుకు డబ్బు?" "పరమేశ్వరుడే ఉన్నా డందరికీ". రైలుబంగాళీ కూతకూసింది. "కూత మార్చిందే యింజన్?" అంది వితంతువు. "ఆలాగే ఇంజను" అన్నాడు నిస్పృహగా స్వాములవారు. "విజయనగరంలో మీ బస?" "నీవుచేసే

చోటనే" "నిజంగా ?" "నారాయణ్" అని జపించాడు స్వాములవారు. "శ్రీమన్నారాయణ్" అని సంస్మరించింది వితంతువు.

రైలు కోరుకొండ స్టేషను దాటింది. వితంతువు తన చేతిలోని చీటీ స్వాములవారి కందిస్తూ "ఇందులో పంతులేం వ్రాశాడో చదవండి" అంది —

"ఈ మనిషిని వంటక్కుదిర్చాను. నెలకు పదిహేనురూపాయలు జీతం. మిక్కిలి ప్రేమతో చూడవలసిందిసుమా ! నేనింకా మఱోతూరి బెంగుళూరు వెళ్ళిగాని యింటికి రావడానికి వల్లలేదు. బండీడబ్బు లిచ్చేసెయ్యి.

ఇట్లు నీపెనిమిటి

పంతులు'.

"పైవిలాసం ?" అంది వితంతువు. స్వాములవారు చీటీ వెనుక వైపు త్రిప్పి "రాణీరంగప్పారావు పంతులు ! కస్పా" అని చదివేడు. "అయితే వారింటిపేరు రాణీవారుఅన్నమాట". "ఆలాగే తోస్తుంది" అన్నాడు స్వాములవారు. "మనం విజయనగరంలో దిగేసరికి ఎంత టైమవుతుందంటారు ?" "అవదుమరీ రేత్రివొంటిఘంట !" "ఈరాత్రి రాత్రి నేపోతే ఆ యిల్లాలు తలుపు తీస్తుందా ?" పోనీ "యుదయం వెళ్ళు". "అందాకా ?" 'నారాయణ్ నారాయణ్" "శ్రీమన్నారాయణ్".

రైలు విజయనగరం స్టేషన్‌లో ఆగింది. జట్కావాళ్లు కటకటాల ఆతల్నుంచి "జటకాబండిబాబూ ! స్వాములూ ! జటకా ! అమ్మగారూ ! జటకా !" అంటూ కేకలువేసేరు.

"చూడండి" అంది వితంతువు, స్వాములవారి దృష్టి తనకేసి మలుపుకుంటూ ముసుగు దులుపుకుంటూ. అని తనటిక్కట్టు ఎక్కణ్ణుంచి తీసిందో స్వాములవారి కిస్తూ "మీదానితో జోడించి యిదికూడా ఆ మాయదారి టిక్కట్టు కలక్టరుకివ్వండి ! మనిద్దరకూ వొక్కటే జట్కా ఘంటస్తంభందాకా మాట్లాడండి" అంది. "అక్కణ్ణుంచి?" అన్నాడు స్వాములవారు ఆమె చేతిలోంచి టిక్కట్టందుకుంటూ. "అటునుంచి సరుక్కు రమ్మన్నాడు. శ్రీమన్నారాయణ్" అంది వితంతువు. "నారాయణ్ ! నారాయణ్ !" అన్నాడు స్వాములవారు.

ఘంటస్తంభం అన్నది విజయనగరంలో బహూవలమైన స్తంభం, నిడుపైన స్తంభమూను. దానినీడను కూర్చుంటే వేసంగి శీతకట్టులాగా, పవర్నమి అమావాస్యలాగా గడచిపోతాయి. జట్కా దిగి స్వాములవారు జట్కావాడికి డబ్బులు ఇస్తూవుంటే వితంతువు 'ఎందుకు నావద్ద వున్నాయి డబ్బులు' అని తనరొంటినుంచి వెచ్చ వెచ్చగా పావలాతీసి జట్కావాడికిచ్చి సాగనంపి స్వాముల వారితో 'చూడండి ! ఈమీద మీ జీవితం నాజీవితం మమైకం అనుకోండి ఇలానిరుద్యోగ సమస్యలో పడి పడి మీరు కాషాయవస్త్రాలు ధరించడమనేది నాకు మనస్కరించడంలేదు. మగవానికి ధైర్యం చెప్పవలసింది స్త్రీయేకాబట్టి నేను చెప్ప సాహసిస్తున్నాను మీకీసలహా. మీరు రేపు వుదయం పొద్దున్నే తెల్లటిఅంగవస్త్రం కట్టుకు, పిలకుంచుకు ఈచీటీ పుచ్చుకొని వ్యాపారిపంతులు ఇంటికివెళ్ళి ఆయనభార్యకు ఈచీటీ చూపించండి. వెంటనే మిమ్మల్ని వంటలో పెట్టుకుంటుంది ఆమె.—చక్కగా నెల అయ్యేసరికి బొంతఅరటిదూట బిళ్ళల్లా పదేను రూపాయలూ చేతిలోకొస్తాయి" అంది. స్వాములవారు ఆమె వొంక చూస్తూ 'నీవు ? నీ చేతులతిమెత్తనా మహా మెత్తనా !"

"నాకు మీకమండలం కాషాయ గుడ్డలూ ఇవ్వండి. యీవూళ్ళోనే భిక్షాటనగావిస్తూ రోజూ శేరు శేరున్నర తండులాలకు తక్కువకాకుండా పట్టుకొస్తాను" "మరి మనిద్దరం రోజూ కలుసుకుంటూ వుండడం :" "ఇప్పుడు కలుసుకున్నట్టే".

తాత్కాలికంగా స్వాములవారికీ వితంతువుకుకూడా తమతమ ఆర్థికసమస్య చక్కగా పరిష్కరింప బడ్డట్టయింది. తెల్లవారింది. క్రమంగా 11-1-1939 తేదీ వచ్చింది. అట్టహాసంగా రంగప్పారావు పంతులు బెంగుళూరు రైప్ ఏపిల్సుతో మైసూరుతాజాచందన్ సరుకుతో సొంత యింటిముందు కస్పా విజయనగరం వీధమ్మట దిగాడు.

లోపట్నుంచి భార్య వంటబ్రాహ్మడితో "పంతులు గారు వచ్చారోయి ! కాళ్లు కడుక్కోడానికి నీళ్ళు ఇయ్యి" అంది, లోపల అద్దంలో అందంచూచుకుంటూ, అద్దంలోంచే, వీధిగుమ్మం ఎక్కుతూవున్న తన మగని ప్రతిబింబం మగనివెనకాల మెట్టెక్కుతూవున్న బండివాని నెత్తిమీద సామానుచూస్తూ; వంటబ్రాహ్మడు నీళ్ళట్టుకునివెళ్ళి మండువాలో పెట్టాడు.

రంగప్పారావు పంతులు కాళ్ళు కడుక్కోకుండానే వంటబ్రాహ్మడికేసి చూస్తూ "వీడెవడే" అన్నాడు. "తమరు రికమెండుచేసిపంపిన వంట మనిషి" అంది భార్య. "వీణ్ణటే నేను పంపించింది ? ఆడమనిషినే. వితంతువునే ? మగవాణ్ణికాదే. యిలాంటి దగుడ్బాజీనికాదే" అన్నాడు. రంగప్పారావు తెల్లబోయి వంటబ్రాహ్మడికేసి చూస్తూ. "ఇదిగోనండి దేవరవారు ఇచ్చిన చీటీ. ఇంకా నావద్దనే వుంది. ఇది అమ్మగారికి కాపరిచే పనిలోకి ప్రవేశించాను" అన్నాడు వంటబ్రాహ్మడు. "నీపిండా

కాదూ ! నాపిండాకాదూను ! చీటీఏది ? ఏంవ్రాశాను అందులో ?'' అని చివరకంటా చదువుకుంటూ పెళ్ళాంముఖంకేసి చూచాడు. పెళ్ళాం "వంట లక్కలకంటె వంటలవాండ్రే అణకువగా పనిచేస్తారండీ ! మీకు తెలియదుగాని, మీరు ఎవర్ని చూచి ఎవరనుకుంటూవున్నారో ! ఈ మనిషే నాకు మీ యీ చీటీ యిచ్చింది. మర్నాటినుంచీ పనిలో ప్రవేసించిందీని. బాగా జ్ఞాపకం చేసుకోండి''.

రంగప్పారావు పంతులు "కాదే ! అది ఆడదే.'' అని జేబులోంచి అయిదు రూపాయిలు తీసియిచ్చి "నూ చేసిన దానికిడబ్బు ఇదిగోపో! తక్షణం ! మళ్ళానాగుమ్మం తొక్కకు.'' అని కోపంతో వంటబ్రాహ్మణ్ణి తరిమేశాడు. వంట బ్రాహ్మణుడు "నారాయణ్ ! నారాయణ్ !'' అని రంగప్పారావు యింటిమెట్లు దిగుతూవుంటే "శ్రీమన్నారాయణ్ !'' అని భిక్షకురాలు వితంతువు మెల్లెక్కుతూ పొడగట్టింది. రంగప్పారావుభార్య "హో ! దరిద్రురాలా ! అస్తమానం ముష్టేనీకు ?' అని పొమ్మనమంది. రంగప్పారావు బీదరాలికేసి నిదానించి చూస్తూ 'సాధురాల్లాగుందే. వెనక్కు పిలువు' అన్నాడు. పెండ్లాం ఫెడీల్ని వీధితలుపువేసి "మీకు వణ్ణంవండి మీసాధురాలికి వడ్డుదంచి ఈ పైనుంచి కాపరం వెలగబెడతా ! రమ్మన్నారు తిమ్మన్న బంతికి ! ఆవంటబ్రాహ్మణ్ణి మీరు వెనక్కుపిలచి తిరిగి పనిలో ప్రవేశపెడితేనే నేను సాధురాలిని పిలిచి పిడికెడు బియ్యం వెయ్యడం'' అంది. అంటూ దుమదుమా పడమటింట్లోకి చక్కాపోయింది.

రంగప్పారావు పంతులు సాధురాలి ముఖం గుర్తుపట్టి "అది రైల్లో ఆవేషం ఊరిలో ఈవేషం వేసుకు తిరుగుతూవుందిలాగుంది. వాడు రైల్లో నివృత్తిగాను ఊళ్లో ప్రవృత్తిగాను వుంటున్నాడులాగుంది'' అని

వితంతువును స్వాములవారినిగురించి స్వగతించుకుంటూ వెంటనే తాను ఎన్నడూ అనుకోని వైరాగ్యప్రసక్తిలో పడ్డాడు. రాణీ రంగప్పారావు పంతులు వైరాగ్య ప్రసక్తిలో పడ్డాడు.

—:o:—

| | | |
|---|---|---|
| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| 7—2—1939 | విజయనగరం | "వినోదిని"లో |